సోలార్ హబ్‌గా ఉమ్మడి అనంత

- ఒక్కో నియోజకవర్గానికి పదివేల సూర్యఘర్ కనెక్షన్లు
- విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
- నీచ రాజకీయం జగన్‌కే సాధ్యం: మంత్రి అనగాని
- చంద్రబాబు వల్లే జిల్లా అభివృద్ధి: మంత్రి సవిత
- కూటమితో రాష్ట్రంలో మరింత ప్రగతి: మంత్రి సత్యకుమార్



మాట్లాడుతున్న మంత్రి అనగాని, చిత్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు

మడకశిర/నెట్‌వర్క్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాను సోలార్ హబ్ చేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ముందుకు సాగుతున్నారని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో శుక్రవారం ఆయన రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత, సత్యకుమార్‌తో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా నాలుగు సబ్‌స్టేషన్లను ప్రారంభించారు. మరో మూడు సబ్‌స్టేషన్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. తొలుత మడకశిరలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించి, మాట్లాడారు. మంత్రి రవికుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతులకు విద్యుత్ సమస్యలు లేకుండా చేసేందుకు నాలుగు 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లు ప్రారంభించి, మరో మూడు సబ్ స్టేషన్ల నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు తెలిపారు. వ్యవసాయానికి 9 గంటలు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. అందుకోసం త్వరలో సోలార్ ప్రాజెక్టులు కూడా రానున్నట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం సూర్యఘర్ పథకం కింద ఇళ్లపై సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం రాష్ట్రానికి 20 లక్షల కనెక్షన్లు మంజూరు చేసిందన్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 10 వేల కనెక్షన్లు ఇస్తున్నట్లు తెలిపారు. మడకశిర ప్రాంతంలో సోలార్ ప్రాజెక్టులు ఏర్పాటుకు అనువైన ప్రాంతం కావడంతో రాబోయే రోజుల్లో ఇక్కడికి పెద్ద ఎత్తున సోలార్ ప్రాజెక్టులు వస్తాయన్నారు. ప్రతి సబ్ స్టేషన్ సమీపంలో సోలార్ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందుకోసం టెండర్లు కూడా పిలిచినట్లు వెల్లడించారు.

పెద్దిరెడ్డి అక్రమాలను బయటకు తీస్తాం

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భూ అక్రమాలను, రెవెన్యూ రికార్డుల దహనం వంటి వాటిని వెలికి తీస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ బాగోతాలు బయటపడటం, దాల్మియా సిమెంట్స్‌కు సంబంధించి ఆస్తులను ఈడీ అటాచ్‌మెంట్‌తో తెరపైకి టీటీడీ గోశాలను తెచ్చారని ఆరోపించారు. ఇంత నీచ రాజకీయం జగన్ ఒక్కడికే

(మిగతా 7వ పేజీలో..)

అపోహలకు తావివ్వొద్దు

- సమష్టిగా ముందుకు సాగండి
- కూటమి నేతలకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్ సూచన
- ఎంపీ, ఎమ్మెల్యేలు, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో సమావేశం



టీడీపీ, బీజేపీ, జనసేన జిల్లా నేతలతో ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్

అనంతపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కూటమి నేతల మధ్య అపోహలకు తావుండకూడదని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్ అన్నారు. మూడు పార్టీల నేతలు సమష్టిగా ముందుకు సాగాలని, వైసీపీ కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని సూచించారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగాలని అన్నారు. నగరంలోని రోడ్లు, భవనాల అతిథి గృహంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, అశ్మిత్ రెడ్డి, అమిలినేని సురేంద్రబాబు, గుమ్మనూరు జయరాం, టీడీపీ, బీజేపీ, జనసేన జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, కొనకొండ్ల రాజేష్, టీసీ వరుణ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్ చౌదరి, సీనియర్ నాయకుడు ముంటిముడుగు కేశవరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి తదితరులతో శుక్రవారం ఆయన అంతర్గత సమావేశం నిర్వహించారు. పార్టీల పరంగా పలు అంశాల గురించి మంత్రి చర్చించారని తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు, కొన్ని నియోజకవర్గాల్లో ఆది నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులను కాదని కొత్తగా పార్టీలోకి వచ్చినవారికి ప్రాధాన్యం ఇస్తున్నారని కొందరు టీడీపీ నాయకులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. చౌక డిపోల విషయంలో నియోజకవర్గాల్లో తలెత్తిన సమస్యను కొందరు ఎమ్మెల్యేలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికీ వైసీపీ డీలర్లు వేలిముద్రలు వేస్తేనే సరుకులు పంపిణీ చేసే పరిస్థితి ఉందని, వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. నియోజకవర్గాల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని ఎంపీ, ఎమ్మెల్యేలు కోరారు. ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ఆదేశించాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకోవాలని, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు త్వరగా పూర్తి అయ్యేలా ఎమ్మెల్యేలు ముందుకు సాగాలని సూచించారు. కార్యకర్తల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని, వారి సమస్యలను పరిష్కరిస్తూ అందరినీ ఏకతాటిపైకి తీసుకురావాలని సూచించారు. పార్టీ నేతల మధ్య వైరుధ్యాలు, ఇతర సమస్యలను పార్టీ జిల్లా అధ్యక్షులతో సమన్వయం చేసుకొని పరిష్కరించుకోవాలని సూచించారు. కుటుంబ సాధికార సారథులు, గ్రామ, వార్డు కమిటీలు, మండల, పట్టణ కమిటీలను గడువులోపు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ కమిటీల విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ఈనెల 23లోపు కుటుంబ సాధికార సారథుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని, ఆ తరువాత గ్రామ, వార్డు కమిటీలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేలను కోరారు. ఈ రెండు కమిటీలు పూర్తయిన తరువాత మండల కమిటీలు, నియోజకవర్గస్థాయి కమిటీలు పూర్తి చేయాలని ఎమ్మెల్యేలకు సూచించారు. సమావేశం అనంతరం బయటకు వచ్చిన ఇన్‌చార్జ్ మంత్రికి ఒకరిద్దరు ఎమ్మెల్యేల తీరుపై పలువురు కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కొంత అలజడి చోటుచేసుకుంది.

సమస్యలను పరిష్కరించండి

కలెక్టర్, ఎస్పీకి టీజీ భరత్ ఆదేశం

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, ప్రజలు మీ దృష్టికి తెచ్చే సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్‌ను జిల్లా ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మంత్రి శుక్రవారం ప్రత్యేకంగా సమావేశ మయ్యారు. సమన్వయ కమిటీ సమావేశంలో ప్రజాప్రతినిధులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను కలెక్టర్, ఎస్పీలకు వివరించి, పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో శాంతి భద్రత పరిరక్షణకు చర్యలు తీసుకోవడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చొరవ చూపాలన్నారు.

అనంతపురం రామచంద్రనగర్ చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



ప్రభువు సన్నిధిలో..

గుడ్ ఫ్రైడేని పురస్కరించుకుని క్రైస్తవులు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మానవాళికోసం ఏసుక్రీస్తు ప్రాణత్యాగాన్ని చేసిన రోజు ఇదని మత పెద్దలు వివరించారు. క్రీస్తు బోధించిన ఏడు అంశాల గురించి వివరించారు. జిల్లా వ్యాప్తంగా చర్చి ప్రాంగణాలలో ఆధ్యాత్మిక సందడి కనిపించింది.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్

వైభవం.. మల్లేశ్వరుడి రథోత్సవం..



మల్లేశ్వర స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కంబదూరులో వెలసిన మల్లేశ్వర స్వామి రథోత్సవం అశేష భక్తజనం నడుమ శుక్రవారం వైభవంగా సాగింది. మల్లేశ్వర స్వామి రథోత్సవాన్ని గ్రామంలోని పురవీధుల గుండా ఓం నమఃశివాయ అనే మంత్రంతో భక్తులు గ్రామస్తులు కలసి రథాన్ని లాగారు. స్థానిక పాత బస్టాండు నుంచి పోస్టాఫీసు సర్కిల్ మీదుగా కోటవీధి వరకు మల్లేశ్వరస్వామి రథోత్సవం అత్యంత కన్నుల పండువగా సాగింది. సాయంత్రం 4 గంటల నుంచి 11 గంటల వరకు రథోత్సవాన్ని తిలకించేందుకు స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల నుంచి భక్తులు అశేషంగా తరలివచ్చి స్వామివారి సేవలో పాలుపంచుకున్నారు. శనివారం ఉట్లమాను పరుష కూడా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

టచ్ చేస్తే షాకే..!



- పని జరగాలంటే ఆ అధికారికి పైసలివ్వాల్సిందే
- చేతులు తడిపితే చాలు.. పనులన్నీ చకచకా..
- బడాబాబులకు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల అప్పగింత
- రూ.లక్షల్లో లంచం తీసుకున్నట్లు ఆరోపణలు
- ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారుల చర్యలు శూన్యం
- బదులుగా ప్రమోషన్‌తో ఆయనకు సత్కారం
- ట్రాన్స్‌కోలో ఓ అధికారి అంతులేని అవినీతి కథలు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఆ అధికారి అవినీతి కథలు వింటే కరెంట్ షాక్ కొట్టినట్లు ఉంటుంది. పైసలిస్తే చాలు ఏపని అయినా ఆగమేఘాలపై జరిగిపోతుంది. డబ్బులిస్తే చాలు సీనియార్టీ అవసరమే లేదు ట్రాన్స్‌ఫార్మర్ ఇంటికొచ్చి చేరుతుంది. లెక్క ముడితే చాలు కమర్షియల్ కనెక్షన్ అయినా వ్యవసాయ కనెక్షన్‌గా మారిపోతుంది. విపరీతమైన ధనదాహంతో అంతులేని అవినీతికి పాల్పడినట్లు పలు విమర్శలు వినవస్తున్నాయి. బదిలీపై వెళ్లిపోయినా నేటికీ ఆయన అవినీతి కథలు కథలుగా చెబుతున్నారంటే ఏస్థాయిలో అక్రమాలకు పాల్పడ్డారో అర్థం చేసుకోవచ్చు. ముడుపులు చెల్లించలేని సామాన్య రైతులు ఏళ్ల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగినా వారిని ఏమాత్రం పట్టించుకోలేదన్న విమర్శలు ఆ అధికారిపై ఉన్నాయి. ఎన్ని ఆరోపణలు వచ్చినా పట్టించుకోని ఉన్నతాధికారులు బదులుగా ప్రమోషన్ ఇచ్చి మరో చోటుకు పంపారు. ఇదంతా కళ్యాణదుర్గం ట్రాన్స్‌కో కార్యాలయంలో పని చేసి వెళ్లిన ఓ అధికారి అవినీతి కథాకమామిషు ఉదాహరణలతో...

- కంబదూరు మండలం ఒంటారెడ్డిపల్లిలో ఓ బడాబాబుకు ఎలాంటి అంచనా, అనుమతులు లేకుండానే ఆగమేఘాల మీద వ్యవసాయ కనెక్షన్ ఇచ్చారు. 15 రోజుల వ్యవధిలోనే పనులు చక్కబెట్టారు. ఇందుకుగాను పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన ఓ వ్యక్తి కంబదూరు మండలం ఒంటారెడ్డిపల్లిలో ఆరు నెలల కిందట 200 ఎకరాలు కొనుగోలు చేసి అందులో శ్రీ గంధం సాగు మొదలు పెట్టాడు. విద్యుత్తు కనెక్షన్ కోసం అతడితో డీడీలు కట్టించుకుని, సీనియారిటీ మేరకు సామగ్రి మంజూరు చేయాల్సి ఉంది. అయితే కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో పనిచేసే ఓ అధికారి ఆ బడా వ్యక్తితో రూ.22 లక్షలు తీసుకుని అప్పటికప్పుడు సామగ్రి అందించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. అనుమతులు లేకుండానే 10 ట్రాన్స్‌ఫార్మర్లు, వంద వరకు విద్యుత్ స్తంభాలు, తీగలు, ఇతర సామగ్రిని అప్పగించేశారు. అందులో ఇతర రైతుల పేరుతో మంజూరైన విద్యుత్తు సామగ్రిని కూడా ఆ బడా వ్యక్తి పొలానికి తరలించినట్లు సమాచారం. దీనిపై అనుమానం రాకుండా పొలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లపై సర్వీస్ నెంబర్లు కూడా రాయలేదు. ఈ విషయం బయటకు రావడంతో కొత్తగా అంచనాలు రూపొందించి అనుమతులు మంజూరు చేసినట్లు కూడా తెలిసింది. ఈ వ్యవహారంలో ఓ కింది స్థాయి అధికారి కూడా సహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి అప్పట్లోనే బడా వ్యక్తి పొలానికి విద్యుత్తు కనెక్షన్ ఇచ్చారు. దీంతో అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి కొత్తగా సామగ్రి మంజూరు చేసినట్లు రికార్డులు తయారు చేసే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. వాస్తవానికి శ్రీగంధం సాగుకు కమర్షియల్ కనెక్షన్ ఇవ్వాల్సి ఉండగా, డబ్బులు తీసుకుని వ్యవసాయ కనెక్షన్‌గా నమోదు చేయడం గమనార్హం.

గతంలోనూ ఇంతే..

- కళ్యాణదుర్గం పరిధిలో పనిచేసిన ఆ అధికారిపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ పాలనలో అప్పటి మంత్రి ఉష శ్రీచరణ్ అండతో రెచ్చిపోయారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుకు రూ.2లక్షల వరకు వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అతడి అవినీతిపై విచారణకు వచ్చిన అధికారుల ను సైతం మచ్చిక చేసుకుని చర్యలు లేకుండా తప్పించుకున్నట్లు ఆరోపణలు వినిపించాయి.
- కంబదూరు మండలం తిమ్మాపురంలో బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి భూమి కొనుగోలు చేసి శ్రీగంధం సాగు చేస్తున్నారు. అతడి నుంచి రూ.8 లక్షలు తీసుకుని ఒక ట్రాన్స్‌ఫార్మర్, 60 విద్యుత్ స్తంభాలు మంజూరు చేశారు. దీనిపై విచారణ జరగకుండా ఉన్నతాధికారులకు రూ.5లక్షల వరకు అప్పట్లో ముట్టజెప్పినట్లు సమాచారం.
- బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల కాంట్రాక్టర్లతో కుమ్మక్కై పెద్ద మొత్తంలో వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. రూ. 2 లక్షలు ఇవ్వనిదే ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర సామగ్రి ఇవ్వడం లేదు. దీనిపై పలు మార్లు అప్పట్లో రైతులు ఉన్నధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం.
- 2018లో ప్రభుత్వం కొనుగోలు చేసిన మోటార్లను కూడా వైసీపీ పాలనలో పక్కదారి పట్టించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మాజీ మంత్రి ఉష శ్రీచరణ్ సహకారంతో 500 మోటార్లను కర్ణాటకకు చెందిన ప్రైవేటు వ్యక్తులకు విక్రయించినట్లు అప్పట్లో ఆరోపణలు బలంగా వినిపించాయి.
- వైసీపీ హయాంలో కూడా డివిజన్ పరిధిలో కొత్త సబ్ స్టేషన్లో షిఫ్ట్ ఆపరేటర్ ఉద్యోగాలను ఒక్కొక్కటి రూ.8 లక్షల వరకు అమ్ముకున్నట్లు తెలిసింది.
- సబ్‌స్టేషన్ల నిర్వహణ కోసం అందులో పనిచేసే సిబ్బందికి అందించాల్సిన రక్షణ పరికరాలను సైతం ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఇంతలా బరితెగించి అవినీతికి పాల్పడిన ఆ అధికారిపై ఏ ఒక్క ఉన్నతాధికారి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అర్ధరాత్రి వాహన తనిఖీలు

పరిశీలించిన ఎస్పీ



ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎస్పీ

అనంతపురం క్రైం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గురువారం అర్ధరాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్పీ జగదీష్ పలు ప్రాంతాల్లో వాహన తనిఖీలను పరిశీలించారు. రాత్రి 11 నుంచి ఒంటి గంట వరకు జిల్లాలోని 48 ప్రాంతాల్లో వాహన తనిఖీలు నిర్వహించారు. ఎస్పీతోపాటు ఏఎస్పీ, నలుగురు డీఎస్పీలు, 22 మంది సీఐలు, 29 మంది ఎస్‌ఐలు పాల్గొన్నారు. మొత్తం 2382 వాహనాలు తనిఖీ చేశారు. డ్రంకెన్ డ్రైవ్‌కు సంబంధించి 4 కేసులు నమోదయ్యాయి. 34 వాహనాలను సీజ్ చేశారు. మోటర్ వెహికల్(ఎంవీ)కి సంబంధించి 142 కేసులకు రూ.38.045 జరిమానా విధించారు.

సోలార్‌హబ్‌గా ఉమ్మడి జిల్లా

(5వ పేజీ తరువాయి)

సాధ్యమన్నారు. వైసీపీ నాయకులకు హిందూతత్వం మీద నమ్మకం లేదన్నారు. అందుకే ఇలాంటి వాటికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు

విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధి ఆయనతోనే సాధ్యమన్నారు. కర్ణాటక సరిహద్దులో ఉన్న మడకశిర ఈ రోజు సాగు, తాగునీరు అందుతున్నాయంటే అందుకు కారణం చంద్రబాబు అని తెలిపారు. 2014-2019 గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మించారని, కియ పరిశ్రమ తెచ్చారని, తద్వారా జిల్లా అభివృద్ధికి బాటలు వేశారన్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కృషి వల్ల నియోజకవర్గం రూపురేఖలు మారబోతున్నాయని పేర్కొన్నారు.

రూ.7వేల కోట్లతో సోలార్ పార్క్

మడకశిర నియోజకవర్గంలో రూ.7వేల కోట్లతో సోలార్‌పార్క్ నిర్మించబోతున్నారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు ఎంఎస్‌రాజు చేసిన పోరాటం అభినందనీయం అన్నారు. సూర్యఘర్ పథకం వల్ల వినియోగదారుడుగా ఉన్న సామాన్యుడు విద్యుత్ ఉత్పత్తిదారుడుగా మారుతున్నారు. భవిష్యత్తులో ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఆపుల మృతిపై భూమన కరుణాకర్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే గోశాల నంద ర్శనకు ఎందుకు వెళ్లలేదని, ఇంటి దగ్గరే ఉండి రోడ్డుపై దర్నా చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు.

ప్రణాళికాబద్ధంగా ముందుకు

మడకశిర నియోజకవర్గం అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో రాష్ట్రంలో నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలపడమే లక్ష్యం అన్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అనుభవంతో నియోజకవర్గాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కందికుంట ప్రసాద్, పల్లె సింధూరారెడ్డి, దగ్గుపాటి వెంకటప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు అంజినప్ప, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సురేంద్ర, డీఈ భూపతి, ఏడీ రమునాథ్, ఏఈ సిద్దేశ్వర, విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

గ్రామల్లో ఘన స్వాగతం

విద్యుత్ సబ్‌స్టేషన్లు ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రులకు వైబీ హళ్లికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మంత్రులకు గజమాలలు వేసి స్వాగతం పలికారు. గ్రామం నుంచి సబ్‌స్టేషన్ వరకు ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. రొళ్ల మండలంలోని రంగనపల్లి గ్రామంలో కూడా మంత్రులు, ఎమ్మెల్యేలకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మార్కెట్‌యార్డు చైర్మన్ గురుమూర్తి ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది.

నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యం: అనగాని



పి.శివరం గ్రామంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు

ప్రారంభించిన సబ్‌స్టేషన్లు

- మడకశిర మండలంలో వైబీహళ్లి, కదిరేపల్లి
- అగళి మండలం ఇనగలూరు
- అమరాపురం మండలం పి.శివరం గ్రామం

భూమిపూజ చేసినవి..

- రొళ్ల మండలం రంగనపల్లి
- గుడిబండ మండలం కేకే పాళ్యం
- మడకశిర మండలం గుండుమల గ్రామం

జిల్లాలో నియోజకవర్గం అభివృద్ధిపై ఎమ్మెల్యేల నుంచి వచ్చే ప్రతిపాదనల పట్ల సానుకూలంగా స్పందించాలని జిల్లా కలెక్టర్ చేతన్‌ను రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా శుక్రవారం మడకశిర ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన తన సహచర మంత్రులతో కలిసి కలెక్టర్, ఇతర జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాల పట్ల సానుకూలంగా స్పందించడంతో పాటు వేగంగా ఫైల్ పూర్తి చేయాలన్నారు.

పార్టీ బలోపేతానికి అంకితం కావాలి: మంత్రులు

ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రివ్యూ మీటింగ్ అనంతరం జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ తదితరులు మాట్లాడుతూ.. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులందరూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ముందుగానే గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి కమిటీలను పూర్తి చేయాలని సూచనలు చేశారు.

క్రైం కార్నర్

నీటి కొళాయి వద్ద ఘర్షణ.. పలువురికి గాయాలు





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వడ్డే కాలనీలో నీటి కొళాయి వద్ద జరిగిన ఘర్షణలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వడ్డే కాలనీలో ఉన్న బోయ ప్రకాష్ చిల్లర కొట్టు నిర్వహిస్తున్నాడు. ఆ దుకాణం సమీపంలో నీటి కొళాయి ఉంది. ఆ నీటి కొళాయికి సమీపంలోనే బోయ హనుమంతరాయుడు, వడ్డే సాంబ, వడ్డే పవన్ కుటుంబాలు ఉన్నాయి. కొళాయి అక్కడ ఉండటం తన వ్యాపారానికి అడ్డుగా ఉందని, దాన్ని తొలగిస్తానని బోయ ప్రకాష్ తరచూ అంటుండేవాడు. ఈక్రమంలోనే శుక్రవారం కూడా గొడవ ప్రారంభించాడు. దీనిని ప్రశ్నించిన హనుమంతరాయుడు, వడ్డే సాంబ, వడ్డే పవన్‌లను దూషించాడు. దీంతో మరణ జరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. బోయ ప్రకాష్ తన చిల్లర కొట్టులో ఉన్న కత్తిరలో హనుమంత రాయుడు, పవన్, సాంబలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితులను కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మరణలో బోయ ప్రకాష్ అతడి కుమారుడు కూడా గాయపడినట్లు సమాచారం. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరి మృతి



ప్రమాద స్థలం

అనంతపురం క్రైం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడిన సంఘటన నగర శివారులో శుక్రవారం ఉదయం జరిగింది. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన మేరకు.. రాప్తాడు మండలం బండమీదపల్లికి చెందిన రంగారెడ్డి(46) అనంతపురంలో బందువుల పెళ్లికి బైక్‌పై ఎన్‌హెచ్-44 రహదారి గుండా బయలుదేరాడు. నగర శివారులోని రాగానే చంద్రబాబునాయుడు కొట్టాలకు చెందిన రెహమాన్ రాప్తాడుకు వెళ్లేందుకు బైక్‌పై రాంగ్‌రూట్‌లో వచ్చి రంగారెడ్డి వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో కింద పడిన రంగారెడ్డి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రెహమాన్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రంగారెడ్డి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. ఇతడికి భార్య లక్ష్మి, కొడుకు, కుమార్తె సంతానం. రెహమాన్ రాప్తాడులోని బిల్డింగ్ షాప్ లో పని చేస్తున్నాడు. ఈ ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

105 మామిడి చెట్ల నరికివేత



నరికేసిన మామిడిచెట్లు

పెద్దవడుగూరు, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రచేడు గ్రామానికి చెందిన రైతులు సాగుచేసిన 105 మామిడి చెట్లను గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు నరికేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిత్రచేడుకు చెందిన రైతులు సన్నారాయణ, లక్ష్మన్న, సూరి, అనిల్ మామిడి సాగు చేశారు. చెట్లను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. మూడేళ్ల వయసున్న 105 మామిడిచెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికేశారు. సన్ననారాయణకు చెందిన గడ్డివాముకు సైతం మూడునెలల క్రితం నిప్పు పెట్టారు. గ్రామంలో కక్షలు రేపేందుకే కొందరు వ్యక్తులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఆంజనేయులు, క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ తో ఘటనాస్థలిలో పరిశీలించారు. చెట్లను నరికేయడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోయారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చీనీలో రసాయన ఎరువులు తగ్గించాలి

- జిల్లా ఉద్యాన శాఖాధికారి ఫిరోజ్‌ఖాన్

గార్లదిన్నె, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): చీనీ సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి ఫిరోజ్‌ఖాన్, రైతులకు సూచించారు. సేంద్రియ ఎరువులే వినియోగించాలన్నారు. మండలంలోని ముకుందాపురం గ్రామం వద్ద చీనీ తోటలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వేసవిలో చీనీ పంటకు అధికంగా నల్లి, వేరుకుళ్లు తదితర తెగులు సోకుతాయన్నారు. వాటి నివారణకు బైటెక్స్, సూడోమోనస్ తదితర మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. వేరుకుళ్లు, బంక తెగుళ్లు సోకితే చీనీ చెట్టు ఎండిపోతాయన్నారు. చెట్లకు తెగులు సోకిన వెంటనే గుర్తించి, ఉద్యాన శాఖాధికారుల సలహాలు పాటించాలన్నారు. చెట్లకు పచ్చి ఎరువులు కాకుండా ఎండిన ఎరువులు వేయాలన్నారు. తద్వారా చెట్లను తెగుళ్ల ఆశించవన్నారు. చీనీ చెట్లలో తెగుళ్లను నివారించి, లాభసాటిగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం డ్రోన్ సర్వే చేపట్టిందన్నారు. జీపీఎస్ సాయంతో డ్రోన్ ద్వారా చీనీ తోటలకు సోకే తెగుళ్లను ఎప్పటికప్పుడు గుర్తించి, నివారణకు తగిన చర్యలు చేపడుతున్నారు. ముకుందాపురం గ్రామాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేసిందన్నారు. ఇప్పటికే సుమారు 950 చీనీ తోటలను జీపీఎస్ ద్వారా ట్రాకింగ్ చేశారన్నారు. ఈ అవకాశాన్ని చీనీ రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి రత్నకుమార్, విస్తరణాధికారులు రామాంజనేయులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



తెగుళ్ల నివారణపై రైతులకు సలహాలు ఇస్తున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి

కేజీబీవీల్లో ఖాళీలు

అనంతపురం విద్య, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయ(కేజీబీవీ)ల్లో ఖాళీగా ఉన్న 71 బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ శుక్రవారం ప్రకటనలో కోరారు. 2025-26 విద్యా ఏడాదికి అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. టైప్-3 కేజీబీవీల్లో హెడ్ కుక్ 8, అసిస్టెంట్ కుక్ 19, డే అండ్ నైట్ వాచ్‌మెన్ 5, స్కావెంజర్ 5, స్వీపర్ 6, టైప్ 4 కేజీబీవీల్లో హెడ్‌కుక్ 6, అసిస్టెంట్ కుక్ 14, చౌకిదార్ 8 పోస్టుల భర్తీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు 18 ఏళ్ల నుంచి 42 ఏళ్ల వరకూ వయో పరిమితి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 ఏళ్ళు, మాజీ సైనిక ఉద్యోగులకు 3 ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్ల వయోపరిమితి మినహాయింపు ఉందన్నారు. ఆసక్తిగల మహిళా అభ్యర్థులు కేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులు, రోస్టర్ ఖాళీలు, ఇతర వివరాలన్నీ సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఏపీసీ పేర్కొన్నారు.

గుడ్ ఫ్రైడే నాడు.. పాస్టర్లకు గుడ్ న్యూస్

- గౌరవ వేతనం విడుదల హర్షణీయం
- జిల్లా పాస్టర్ల సంఘం అధ్యక్షుడు నాగరాజు



అనంతపురంరూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గుడ్ ఫ్రైడే నాడు పాస్టర్లకు గుడ్ న్యూస్ చెప్పారని జిల్లా పాస్టర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు అన్నారు. మండలంలోని రాచానపల్లిలో తన నివాసంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని పాస్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఏడు నెలల గౌరవ వేతనం రూ.30 కోట్లు విడుదల చేయడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో 8,427 మంది పాస్టర్లు ఉన్నారని, వారికి 2024 మే నుంచి నవంబరు వరకు గౌరవ వేతనం నెలకు రూ.5వేల చొప్పున విడుదల చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

కాటేసిన కరెంటు తీగ

- మహిళకు విద్యుత్ షాక్
- కాపాడబోయిన ముగ్గురికి కూడా..
- వృద్ధుడి మృతి.. ముగ్గురికి తీవ్రగాయాలు



ఓబిలేసు మృతదేహం

బత్తలపల్లి, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): కరెంటు తీగ కాటేసింది. విద్యుత్ షాక్ తగిలిన మహిళను కాపాడే ప్రయత్నంలో వృద్ధుడు మరణించాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. మండలంలోని ఎం చెర్లోపల్లిలో శుక్రవారం విద్యుత్ ప్రమాదంలో చిట్లా ఓబులేసు (65) మరణించాడు. అతడి భార్య లింగమ్మ, కుమారుడు నాగభూషణ, లక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెర్లోపల్లికి చెందిన కరవ ఓబులేసు భార్య లక్ష్మి ఇంటి వద్ద దుస్తులు ఉతుకుతుంది. పక్కనే ఉన్న విద్యుత్ సరఫరా అవుతున్న జీఏ వైరు తాకింది. ఆమె స్పృహతప్పి పడిపోయింది. గమనించిన ఆమె కుమారుడు మోక్షిత్ (8 ఏళ్ళు) సమీపంలోని బంధువు చిట్లా ఓబులేసు ఇంటికి పరుగున వెళ్లాడు. తన తల్లి పడిపోయిందని వెంటనే రావాలంటూ చిట్లా ఓబులేసును కోరాడు. వెంటనే అతడితోపాటు భార్య లింగమ్మ, కుమారుడు నాగభూషణ పరుగున వెళ్లారు. లక్ష్మిని పైకి లేపేందుకు తాకారు. వారికీ విద్యుత్ షాక్ తగిలి పడిపోయారు. మోక్షిత్ గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ట్రాన్స్‌ఫార్మర్‌లో విద్యుత్ సరఫరా ఆపేశారు. స్పృహ తప్పి పడిపోయిన నలుగురిని ప్రత్యేక వాహనాల్లో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఓబులేసు మృతిచెందినట్లు తెలిపారు. లింగమ్మ, లక్ష్మి, నాగభూషణ పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

జీఏ వైరు తాకడంతోనే..

గ్రామానికి చెందిన రైతు శంకరయ్య. ఆయన పొలం నుంచి మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు పొలం చుట్టూ విద్యుత్ వైరు లాగాడు. దానికి గ్రామంలోని స్తంభం నుంచి జీఏ వైరు ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నాడు. కర్రల పైనుంచి వైరు లాగాడు. విద్యుత్ స్తంభం సమీపంలోని కట్టె పడిపోవడంతో జీఏ వైరు కింద పడింది. ఆ వైరు తాకడంతోనే ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ డీఈ నరసింహారెడ్డి, ఏఈ శివయ్య, ఎస్ఐ సోమశేఖర్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. రైతు శంకరయ్యపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఈ శివయ్య తెలిపారు. రైతు నిబంధనలకు విరుద్ధంగా జీఏ వైరును నివాస గృహాల సమీపంలోని స్తంభానికి కొక్కెన్ కలిపాడని, విద్యుత్ ప్రమాదానికి కారణమయ్యాడని, శంకరయ్యపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

- గొర్రెల కోసం వెళ్లిన నలుగురి మృతి
- మృతుల్లో ముగ్గురు జిల్లావాసులు





ధనాపురం నాగభూషణ, శీగుపల్లి మురళి, కొటిపి నాగరాజు (ఫైల్)

హిందూపురం/రాయచూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ముగ్గురు, కర్ణాటకచెందిన ఒకరు మృతిచెందారు. రాయచూరు జిల్లా శహాపూర్ తాలూకాలో జరిగే సంతలో గొర్రెలు కొనేందుకు బొలెరో వాహనంలో వెళుతుండగా శుక్రవారం తెల్లవారు జామున రెండు గంటల ప్రాంతంలో ప్రమాదం జరిగింది. వీరి వాహనం అయ్యప్ప అమరపురం క్రాస్ వద్ద రోడ్డు పక్కన గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం ధనాపురం గ్రామానికి చెందిన నాగభూషణం(42), శీగుపల్లికి చెందిన మురళి(44), హిందూపురం మండలం కొటిపికి చెందిన నాగరాజు(40), కర్ణాటకలోని గౌరిబిదనూరు తాలూకా చిన్న బీరేపల్లికి చెందిన సోమప్ప(43) అక్కడికక్కడే మృతిచెందారు. వాహన డ్రైవర్ ఆనంద్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆ మార్గంలో వెళ్లేవారు గమనించి, సమాచారం ఇవ్వడంతో గబ్బూరు పోలీసులు అతన్ని రాయచూరులోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను రాయచూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొటిపి నాగరాజు తరచూ తన బొలెరో వాహనంలో రాయచూరు ప్రాంతంలోని సంతకు వెళ్లి గొర్రెలను కొనుగోలుచేసి తెచ్చి స్థానికంగా విక్రయించేవాడు. ఆయనకు భార్య రూప, కుమారుడు ఉన్నారు. ధనాపురం నాగభూషణ పరిగిలో మటన్ షాపు నిర్వహిస్తుంటాడు. రాయచూరు ప్రాంతంలో గొర్రెలు తక్కువ ధరకు దొరుకుతాయని తెలుసుకుని మిగిలినవారితో కలిసి బయలుదేరాడు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. నాగభూషణకు భార్య సరోజమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. శీగుపల్లి మురళి గొర్రెల వ్యాపారి. అక్కడి నుంచి కొనుగోలు చేసి తెచ్చి స్థానికంగా విక్రయించేవాడు. ఆయనకు భార్య ఉన్నారు. కర్ణాటక పోలీసులు సమాచారం ఇవ్వడంతో బాధిత కుటుంబ బాలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మృతదేహాలను తెచ్చుకునేందుకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు వెళ్లారు. కాగా, డ్రైవింగ్ చేస్తున్న ఆనంద్ అర్ధరాత్రి 12 గంటల తరువాత డ్రైవింగ్ బాధ్యతలను మరొకరికి ఇచ్చాడని పోలీసులు తెలిపారు. అయితే, ప్రమాదం జరిగిన సమయంలో వాహనాన్ని ఎవరు నడుపుతున్నారనే విషయమై స్పష్టత లేదని తెలిపారు.



వాహనంలో ఇరుక్కుపోయిన మృతదేహాలు



ప్రమాదంలో దెబ్బతిన్న బొలెరో వాహనం

వక్ఫ్ చట్టాన్ని ఉపసంహరించుకోవాల్సిందే..

- అప్పటి వరకు పోరాటం ఆగదు
- సంఘాలు, పార్టీల నేతల ఉద్ఘాటన

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాల్సిందేనని, అప్పటి వరకు పోరాటం ఆపేది లేదని వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు ఉద్ఘాటించారు. వక్ఫ్ సవరణ చట్టంపై ముద్రించిన సంచిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లాకేంద్రంలోని క్లాక్‌టవర్ కూడలి వద్ద నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ సర్కారు దేశంలో మతతత్వ రాజకీయాల్లో భాగంగానే ఈ వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. భారతదేశంలో మైనార్టీల హక్కులను కాలరాసే పన్నాగాన్ని లౌకిక, ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ మాట్లాడుతూ.. ముస్లింలకు ఒక్క ఎంపీ సీటు కూడా కేటాయించని బీజేపీ.. వారి ఆస్తులు కాపాడతామని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. క్రైస్తవులు, ముస్లింల విలువైన భూములను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేయడానికి బీజేపీ పన్నిన పన్నాగమే ఈ వక్ఫ్ సవరణ చట్టం అన్నారు. దీనిని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. చట్టాన్ని ఉపసంహరించుకునే వరకు దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామన్నారు. సీపీఐ జిల్లా నాయకుడు నారాయణస్వామి మాట్లాడుతూ.. బీజేపీ చేస్తున్న మతతత్వ రాజకీయాలను ప్రతిఒక్కరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాదాగాంధీ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీని అధికారం నుంచి దింపి లౌకిక ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నగర వ్యాప్తంగా 25 మసీదుల వద్ద సంచికలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, మేయర్ వసీం, ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నదీమ్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఫయాజ్, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు వలి, సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, రైతు సంఘం నాయకుడు చంద్రశేఖర్, ఐఎంఎం బాషా, వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణమూర్తి, టిప్పుసుల్తాన్ సొసైటీ నజీర్, మసూద్, కేవీపీఎస్ నాయకుడు నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.



క్లాక్‌టవర్ వద్ద సంచికను ఆవిష్కరిస్తున్న సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు

న్యూస్ బాక్స్

గుడ్ ఫ్రైడే రోజు క్రైస్తవులకు గుడ్ న్యూస్: ఎమ్మెల్యే



ఎమ్మెల్యేని కలిసిన స్వామిదాస్, పలువురు పాస్టర్లు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): గుడ్ ఫ్రైడే రోజు సీఎం చంద్రబాబునాయుడు క్రైస్తవులకు గుడ్‌న్యూ అందించారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామి దాస్, పలువురు పాస్టర్లు ఎమ్మెల్యేతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతేడాది మే నుంచి నవంబరు దాకా పెండింగ్‌లోని పాస్టర్ల గౌరవవేతనాన్ని సీఎం చంద్రబాబునాయుడు విడుదల చేయడం సంతోషకరమన్నారు. త్వరలోనే సబ్సిడీ రుణాలు, విదేశీ విద్య, జెరూసలేం యాత్ర తదితర పథకాల అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగారామ్, హరికృష్ణ, పాస్టర్లు కృపాదాస్, జీవరత్నం, ఉదయ్, దానియేలు, ఇస్సాకు తదితరులు పాల్గొన్నారు.

'బీసీఐ కో చైర్మన్‌పై దాడిని ఖండిస్తున్నాం'

అనంతపురం క్రైం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కో చైర్మన్ వైఆర్ సదాశివారెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఆలూరు రామిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగుళూరులోని తన చాంబర్‌లో కేసులను అధ్యయనం చేస్తుండగా ఓ కక్షిదారుడు రాడ్లతో దాడి చేసిన ఘటన కలచివేసిందన్నారు. న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

నాలుగో పట్టణ ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

అనంతపురం క్రైం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టిన ఎస్ఐని బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, మోతిలాల్, శివరుద్రప్ప తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కేవైసీ చేయించుకోండి : తహసీల్దార్

అనంతపురం రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణం, రూరల్ ప్రాంతాల్లో ఈకేవైసీ చేయించుకోని రేషన్ కార్డుదారులు, సభ్యులందరూ ఈనెల 30వ తేదీలోగా తప్పక చేయించుకోవాలని తహసీల్దార్ మోహన్‌కుమార్ తెలిపారు. ఆ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన చేశారు. అనంతపురం పట్టణం పరిధిలో 9791మంది, గ్రామీణ ప్రాంతంలో 7393మంది రేషన్ కార్డుదారుల ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈకేవైసీ పెండింగ్ లిస్టు సంబంధి త గ్రామ రెవెన్యూ అధికారి, చౌక డిపో డీలర్, ఎండియూ ఆపరేటర్ వద్ద ఉందన్నారు. ప్రజలు వాటిని పరిశీలించుకొని సంబంధిత డీలర్, వీఆర్వో, ఎండియూ ఆపరేటర్ వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

ఉచిత సామూహిక వివాహాలకు దరఖాస్తు చేసుకోండి

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసంపల్లి సద్గురు యోగి నారేయణ మఠంలో మే 18న ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు ఆ మఠం ట్రస్టు నిర్వాహ కులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు బసంపల్లిలోని నారేయణ మఠం ట్రస్టు సభ్యులను కలిసి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వధువు వయస్సు 18 సంవత్సరాలు, వరుడికి 21 సంవత్సరాలు తప్పక పూర్తి అయి ఉండాలన్నారు. వివాహాలు చేయలేని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. వివరాలకు 8374552424, 9440286620, 9959706783 నంబర్లను సంప్రదించాలన్నారు.

రామమందిరం నిర్మాణానికి శ్రీకారం



భూమిని చదును చేస్తున్న దృశ్యం

శింగనమల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గకేంద్రమైన శింగనమల సమీపంలోని రుషింగమయ్య కొండ మీద రామమందిరం నిర్మాణానికి దాతల సహకారంతో శ్రీకారం చుట్టారు. శింగనమల వద్ద ఉన్న రుషింగమయ్య కొండ చాలా ప్రసిద్ధి చెందినది. ఈ కొండపై రామ మందిరం నిర్మాణానికి రుషింగమయ్యస్వామి భక్తులు పెద్దమట్లగొందికి చెందిన కొరే రాముడు, సురేంద్ర, రుషింగప్ప, శ్రీనివాసులు, పెద్దరంగయ్య, గంగరాజు సహకారంతో శుక్రవారం నుంచి భూమి చదును చేయడం ప్రారంభించారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

రామగిరి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల కుటుంబాలకు సభ్యత్వమే భరోసా అని టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్ పేర్కొన్నారు. మండలంలో టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ జోరుగా కొనసాగుతోంది. దుబ్బార్లపల్లిలో జరిగిన శుక్రవారం కార్యక్రమంలో మండల కన్వీనర్ మాట్లాడుతూ... కుటుంబ సాధికారిక సారథులను వీలైనంత త్వరగా ఎంపికచేయాలని సూచించారు. టీడీపీ సభ్యత్వకార్డుల పంపిణీ పూర్తి కావొచ్చిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవజ్జి వెంకటేశ్, రంగనాయకులు, ఓబుళపతి, ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని 35వ డివిజన్‌కు చెందిన టీడీపీ కార్యకర్త కురుబ శ్రీనివాసులు (58) గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ కార్పోరేటర్ రాజారావు శుక్రవారం మృతుడి స్వగృహంలో భౌతిక కాయానికి పార్టీ కండువా కప్పి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తక్షణసాయంగా బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, అంజి, చలమన్న, మల్లేష్, మోహన్ తదిదరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేయకండి

ఆత్మకూరు ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నాటుసారాతో గ్రామీణ ప్రాంతాల్లోని పలు కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని, కావున నాటుసారా తయారు చేయడాన్ని పూర్తిగా మానుకోవాలని ఎక్సైజ్ ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. జిల్లాలో ఎక్సైజ్ అధికారులు నిర్వహిస్తున్న 2.0 కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని సింగంపల్లి తండా గ్రామంలో శుక్రవారం అనుమానిత ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీ కేసుల్లో ఉన్న వ్యక్తుల ఇళ్లలో సోదాలు చేశారు. అనంతరం నాటుసారా వల్ల కలిగే నష్టాలు, దుష్ప్రభావాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ అన్న పూర్ణ, ఎక్సైజ్ అనంతపురం స్టేషన్ ఎస్ఐ రాజేంద్రప్రసాద్, బుక్కరాయ సముద్రం ఎస్ఐ శ్రీరాములు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు





అరవిందనగర్ సీఎస్ఐ చర్చిలో ప్రసంగిస్తున్న రెవరెండ్ ఐజక్ వరప్రసాద్, హాజరైన క్రైస్తవులు



కార్మెల్‌మాత చర్చిలో యేసు శిలువతో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం జిల్లావ్యాప్తంగా ప్రార్థనలను ఘనంగా నిర్వహించారు. మానవాళికోసం యేసుక్రీస్తు తన ప్రాణాన్ని త్యజించిన శుభ శుక్రవారం సందర్భంగా వాడవాడలా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని క్రీస్తు మందిరాలన్నీ కిటకిటలాడాయి. నగరం లోని అరవిందనగర్‌లో ఉన్న సీయస్ఐ హోలి ట్రినిటి చర్చిలో ప్రెస్‌బిటర్, సీయస్ఐ హెచ్‌టీసీ అనంతపురం డివిజనల్ చైర్మన్ పీడీఎస్‌జే బెన్‌హర్ బాబు ఆధ్వర్యంలో శుభ శుక్రవారపు ఆరాధనను నిర్వహించారు. రెవరెండ్ రెవరెండ్ ఐజక్ వరప్రసాద్ ముఖ్యవక్తగా హాజరై క్రీస్తు బోధించిన ఏడు అంశాలపై ఆధ్యాత్మిక సందేశమిచ్చారు. అనంతరం క్రైస్తవ సంఘం సభ్యులు బైబిల్‌లో ఒక్కో సందేశ సారాంశాన్ని వివరించారు. అలాగే సప్త గిరి సర్కిల్ లోని ఎస్ఐయూ టౌన్ కాంగ్రిగేషనల్ చర్చి ప్రత్యేక ప్రార్థనల నేపథ్యంలో క్రైస్తవులతో కిటకిటలాడింది. రెవరెండ్ సంపత్ విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ప్రార్థనలకు బెంగళూరుకు చెందిన రెవరెండ్ స్టీఫెన్ బాబ్ హాజరై యేసు జీవిత ఇతివృత్తాన్ని బోధించారు. సంఘసభ్యులు బైబిల్ సారాంశాలను చదివి వినిపించారు. అనంతరం గాయనీగాయకులు యేసు క్రీస్తు గీతాలను ఆలపించారు. రామచంద్ర నగర్‌లోని కార్మెల్‌మాత చర్చిలో పాస్టర్ జోసెఫ్, నగర శివారులోని క్రీస్తు విశ్వాసుల సంఘం చర్చిలో పాస్టర్ నతానియేల్ ప్రత్యేక ప్రార్థనలు ని చేశారు. కోర్టురోడ్డులోని గాస్పెల్‌హాల్ చర్చి, అంబేద్కర్ నగర్‌లోని యేసు క్రీస్తు ప్రార్థనామందిరం, కళాకారుల కాలనీలోని రేమా చర్చితోపాటు అన్ని ప్రాంతాలోని చర్చిల్లో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలను ఘనంగా నిర్వహించారు.

● కనగానపల్లి: మండల వ్యాప్తంగా గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. సీఎన్‌కోట చర్చిలో ఏసుక్రీస్తు శిలువను ఊరేగిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా చర్చిల్లో ఫాదర్లు ఏసుక్రీస్తు సందేశాలను వివరించారు.

టెక్స్‌టైల్స్ పరిశ్రమను ఏర్పాటు చేయండి

● మంత్రికి ఎమ్మెల్యే దగ్గుపాటి వినతి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెడీమేడ్ టెక్స్‌టైల్స్ పరిశ్రమను ఏర్పాటు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కోరారు.ఈ మేరకు శుక్రవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంత్రిని ఎమ్మెల్యే కలిసి విన్నవించారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గం పరిధిలో కూటమిలోని మూడు పార్టీలు బలంగా ఉన్న నేపథ్యంలో నామినేటెడ్ పదవులు, ఇతర పనుల విషయంలో ప్రత్యేకంగా చూడాలని కోరారు. జిల్లా కేంద్రానికి దగ్గరగా టెక్స్‌టైల్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే వేలాది మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించడంతోపాటు అనుబంధ యూనిట్ల ద్వారా ఆర్థిక వనరులు పెరుగుతాయని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఘన స్వాగతం



మంత్రికి స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్‌కు టీడీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. శుక్రవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనకు స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, అనంతపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళి తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర కార్యదర్శులు రాయల్ మురళీ, తలారి ఆదినారాయణ, టీడీపీ నాయకులు గంగారామ్, సుధాకర్‌నాయుడు, సంగా తేజస్విని, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్, వడ్డెర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళి తదితరులు ఉన్నారు.

వక్ఫ్ సవరణను ఉపసంహరించుకోవాలి

● కల్లూరు, నార్పలలో ముసింల ర్యాలీ



నార్పలలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

గార్లదిన్నె, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని ముసింలు డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లుకు నిరసనగా శుక్రవారం మండలపరిధి లోని కల్లూరులో జామీయా మజీద్, మదీనా మజీద్, బిలాల్ మజీద్, అబూబకర్ మజీద్, ముస్తాఫుల్ ఖురాన్ మదరసా మత పెద్దల ఆధ్వర్యంలో వందలాది మంది ముస్లింలు స్టేట్ బ్యాంకు నుంచి నీలం సంజీవరెడ్డి సర్కిల్ వరకు శాంతియుతంగా ర్యాలీ చేశారు. ముతవల్లీలు షేక్ ఇమామ్, దాదాఖలందర్, బాబా ఫక్రుద్దీన్, మాబు పీరా తదితరులు పాల్గొన్నారు.

● నార్పల: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరుతూ శుక్రవారం మండలంలోని ముస్లింలు శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. మండలకేంద్రంలోని జామియా మసీదు నుంచి ర్యాలీ ప్రారంభించి తిరిగి అక్కడికే చేరుకున్నారు. వారికి బాషా సప్లయర్స్ ఆధ్వర్యంలో మజ్జిగపంపిణీ చేశారు. ఎస్ఐ సాగర్ బందోబస్తు చేపట్టారు. ర్యాలీలో ముతవల్లి ఇక్బాల్ బాషా, ఖాజీ ఫయాజ్, మౌలానాలు జిక్రియా, ఫారుక్ తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాటు సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. అనంతపురం సూపరింటెండెంట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డితో కలిసి ఎక్సైజ్ అధికారులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం కార్యక్రమాన్ని అమలు చేయాలన్నారు. నాటు సారా స్థావరాలపై దాడులు చేసి, నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. బైండోవర్ చేసిన తర్వాత కూడా నాటుసారా విక్రయిస్తే వారికి రూ. లక్ష జరిమానా విధించేలా కఠినంగా వ్యవహరించాలన్నారు. నాటు సారా తయారీ, రవాణా చేసే వారిపై పీడీ యాక్టు ప్రయోగించేలా జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈఎస్‌లు రేవతి, శ్రీరామ్, సీఐలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయం ముట్టడికి యత్నం

● బీజేపీ నాయకులను అడ్డుకున్న పోలీసులు



ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతిపక్షం లేకుండా కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రతీకారాలకు వాడుకుంటోందని బుధవారం కాంగ్రెస్ ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. దీనిని నిరసిస్తూ శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముట్టడి కార్యాక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదురుగానున్న కేఎస్ఆర్ కళాశాల వద్ద ధర్నా చేపట్టి అనంతరం ముట్టడికి యత్నించారు. రంగ ప్రవేశం చేసిన పోలీసులు.. బీజేపీ నాయకులను అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ మా ట్లాడుతూ... రూ.వందల కోట్ల నేషనల్ హెరాల్డ్ ఆస్తులను కేవలం రూ. 50 లక్షలకే యంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు బదిలీచేసిన ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే సోనియా, రాహుల్‌పై ఈడీ కేసుపెట్టిందని, దీనిని కప్పిపుచ్చుకునేం దుకు బీజేపీపై బురదజల్లేలా కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు.

ఘనంగా సాయిచైతన్య స్కూల్ వార్షికోత్సవం



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

గార్లదిన్నె, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మధురా నగర్‌లో ఉన్న సాయి చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. స్కూల్ కరస్పాండెంట్ రమేష్ బాబు జ్యోతి ప్రజ్వలను చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలు, వినయ విధేయతలు కలిగి ఉండాలన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, డ్యాన్స్‌లు, ఆటలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సాయిచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఉపాధ్యాయులు, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటిశుద్ధి ప్లాంట్లు





కనగానపల్లిలో మూతబడిన వాటర్ ప్లాంటు, తుప్పుపడుతున్న పరికరాలు

● నిర్వహణ లేక మూతబడిన వైనం
● ప్రైవేటు వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్న ప్రజలు

కనగానపల్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో నిర్మించిన పలు వాటర్ ప్లాంట్లు నిర్వహణ లేకపోవడంతో మూత బడి రూ. లక్షలు వృథా అవుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తే వాటి ద్వారా ప్రజలకు తక్కువ ధరకే స్వచ్ఛమైన తాగునీరు అందించవచ్చు. అయితే ఎవరూ పట్టించుకోక పోవడంతో రూ. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ల పరికరాలు తుప్పుపడుతున్నాయి. దీంతో ఆ వాటర్ ప్లాంట్లు మూతబడి ప్రజలు ప్రైవేటు ప్లాంట్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. గత తెలుగు దేశం పార్టీ ప్రభుత్వంలో కనగానపల్లిలో పంచాయతీ నిధులతో వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు. రూ.2కే 20 లీటర్ల స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందేది. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక వాటర్‌ప్లాంటు నిర్వహణ సక్రమంగా చేయకపోవడంతో పరికరాలు దెబ్బతిన్నాయి. వైసీపీ పాలకులు వాటర్‌ప్లాంటును పట్టించుకోక పోవడంతో పాటు కొన్ని పరికరాలను అయిన కాటికి అమ్ముకున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పరికరాలు తుప్పుపట్టడం, కొన్నిటిని అమ్ముకోవడంతో వాటర్‌ప్లాంటు మూతబడింది. మామిళ్ళపల్లిలో ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ రూ.15 లక్షలు వెచ్చించి వాటర్‌ప్లాంటు ఏర్పాటు చేసింది. దానికి గత వైసీపీ ప్రభుత్వంలో నీటి వసతి కల్పించకపోవడంతో పరికరాలు దెబ్బతిని మూతబడింది. దీంతో ప్రజలకు ప్రైవేటు వాటర్‌ప్లాంట్లు దిక్కయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి కొంత నిర్వహణ ఖర్చు భరిస్తే ప్రజలకు తక్కువ ధరకే స్వచ్ఛమైన త్రాగునీరు అందనుంది.

నీటి శుద్ధి ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలి



పంచాయతీ నీటి శుద్ధి ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకరావాలి. ఆ నీటిశుద్ధి ప్లాంటు మూతపడడంతో ప్రైవేటు వారి వద్ద నుంచి రూ.10 వెచ్చించి 20 లీటర్ల క్యాను కొనాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో రూ.2కే వాటర్ క్యాను నీరు వచ్చేది. స్వచ్ఛమైన తాగునీరు పేద ప్రజలకు అందేది.

- అంకే వారాది, కనగానపల్లి

వినియోగంలోకి తెస్తాం

కనగానపల్లి పంచాయతీ వాటర్‌ప్లాంటు గురించి మాకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు. సోమవారం వాటర్‌ప్లాంటు పరిశీలించి, ప్రజలకు వినియోగంలోకి తెస్తాం. మామిళ్ళపల్లిలోని ఆర్డీటీ వాటర్‌ప్లాంటును పంచాయతీకి అప్పగిస్తే దాన్ని కూడా ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తాం.

-అనిల్‌కుమార్, ఎంపీడీఓ, కనగానపల్లి

నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వండి

● జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిని కోరిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



మంత్రి భరత్‌ను కలిసిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం అభివృద్ధికి నిధులను కేటాయించాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలసి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్‌ను కోరారు. శుక్రవారం అనంతపురానికి వచ్చిన మంత్రి భరత్‌ను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో మర్యాద పూర్వకంగా కలసి, నియోజకవర్గంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. మంత్రి సానుకులంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, సీనియర్ నాయకుడు ముంటిమడుగు కేశవరెడ్డి, నాయకులు తలారి ఆదినారాయణ, రాయల్ మురళి, పసువుల శ్రీరామిరెడ్డి జీసీ రామానాయుడు పాల్గొన్నారు.

మంత్రి టీజీ భరత్‌ను కలిసిన అహుడా చైర్మన్



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీసీ వరుణ్, నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీల సమన్వయ సమావేశానికి జిల్లాకు వచ్చిన రాష్ట్ర పరిశ్రమల శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్‌ను అహుడా చైర్మన్ టీసీ వరుణ్ కలిశారు. ఈ మేరకు గురువారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన ఆ పార్టీ నాయకులతో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. అందరి సమన్వయంతో రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వంలో జనసేన పార్టీ తనవంతు క్రియాశీలక పాత్ర పోషిస్తుందని టీసీ వరుణ్ తెలిపారు.

శింగనమల ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదు

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎదుట పలువురి ఆవేదన

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తమను పట్టించుకోవడం లేదని పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఎంపీ, ఎమ్మెల్యేలు, కూటమి నాయకులతో మంత్రి టీజీ భరత్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శింగనమల నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే శ్రావణిశ్రీపై ఫిర్యాదు చేశారు. వైసీపీ హయాంలో కేసులు పెట్టించుకొని పార్టీ కోసం కష్టపడి పనిచేశామని, పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే తమను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని, కనీస గౌరవం ఇవ్వడం లేదని శింగనమల మండలం వెస్ట్ నరసాపురం ఎంపీటీసీ అంజనమ్మ, ఆమె భర్త ప్రసాద్ నాయక్ మంత్రి ఎదుట ఆవేదన వ్యక్తం ఏశారు. అదే మండలం పెరవలికి చెందిన చిదానంద నాయుడు, పలువురు కార్యకర్తలు ఎమ్మెల్యే పనితీరుపై ఫిర్యాదు చేశారు. వైసీపీ, కాంగ్రెస్ హయాంల్లోనూ పార్టీ కోసం కష్టపడిన తాము చెప్పిన వారికి ఎఫ్‌పీ షాపు, ఫీల్డ్ అసిస్టెంట్, ఇతర పనులు ఇవ్వకుండా ఇతరులకు ఎమ్మెల్యే ప్రాధాన్య మిస్తున్నారని యల్లనూరు మండలం వాసాపురానికి చెందిన టీడీపీ నాయకులు వాసాపురం బాబు మంత్రికి ఫిర్యాదు చేశారు. ఈ సమయంలో యల్లనూరు మండలం బొప్పేపల్లికి చెందిన రవీంద్రారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి చాంబర్ నుంచి బయటకు రాగానే ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. అప్రమత్తమైన పోలీసులు.. ఇరువర్గాలకు సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించారు.

కూలీలకు ఉపాధి భృతి రూ.12వేలు ఇవ్వాలి

● ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవరెడ్డి



మాట్లాడుతున్న కేశవరెడ్డి

అనంతపురం విద్య, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కూలీలకు ఏడాదికి ఉపాధి భృతి కింద రూ.12 వేలు ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం నాయకులు సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ... జనవరి 20వ తేదీ నుంచి ఇప్పటి వరకూ ఉపాధి కూలీలకు పెండింగ్ ఉన్న రూ.37 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఉపాధి కూలీలకు 2021 నవంబరు నుంచి సమ్మర్ అలవెన్సు ఇవ్వడం లేదన్నారు. 100 రోజులు పూర్తి చేసుకున్న కూలీలకు పనిముట్లు ఇవ్వాలన్నారు. కూలీలకు ఏడాదికి ఉపాధి భృతిగా రూ.12 వేలు ఇవ్వాలని కోరుతూ.. ఈ నెల 21వ తేదీ కష్టజీవుల పాదయాత్ర కార్యక్రమం చేపడుతామరు. నార్పల మండలం బండ్లపల్లి నుంచి అనంతపురం వరకూ పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. 22వ తేదీ సాయంత్రం కృష్ణకళామందిర్‌లో బహిరంగసభ నిరహిస్తామన్నారు. మాజీ ఎంపీ తులసిరెడ్డి, సీపీఐ రామకృష్ణ ఇతర నేతలు హాజరవుతారన్నారు. ఆ సంఘం నాయకులు నాగరాజు, పెద్దయ్య, రామాంజినేయులు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

● నార్పల: ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టే కష్టజీవుల పాదయాత్రను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పెద్దయ్య, సీపీఐ మండల కార్యదర్శి సాకే గంగాధర్ కోరారు. నార్పలలో శుక్రవారం పాదయాత్ర కరపత్రాలను విడుదల చేశారు. సీపీఐ మండల నాయకులు చాపల రామాంజి, నాగరాజు, సూరి, రాజు, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల క్రికెట్ జట్టు ఎంపిక పోటీలకు మంచి స్పందన వచ్చింది. ఉమ్మడి జిల్లా దివ్యాంగుల క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను శుక్రవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ దివ్యాంగుల క్రికెట్ జట్టు కమిటీ చైర్మన్ సూర్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన పోటీలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 60 మందికిపైగా క్రీడాకారులు హాజరయ్యారు. వారికి బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్, కీపింగ్, ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. త్వరలో తుది జట్టును ప్రకటిస్తామని తెలిపారు. ఎంపికైన జట్టు జూన్‌లో జరిగే రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రికెట్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగా రెడ్డి, దివ్యాంగ క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శంకర నారాయణ, రోషిరెడ్డి, ఆంధ్రా మాజీ రంజీ ప్లేయర్ షాబుద్దీన్, మాజీ క్రికెటర్లు కమలా కర్ నాయుడు, మధుసూదన్ నాయక్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మడుగు కాదది.. పాఠశాల ఆవరణం

● ఎర్రగుంట ప్రభుత్వ పాఠశాలలో పెద్దఎత్తున మురుగునీటి నిల్వ
●ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


మడుగును తలపిస్తున్న పాఠశాల ఆవరణం

కుందుర్పి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంట గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి పెద్దఎత్తున మురుగునీరు చేరి మడుగును తలపిస్తోంది. దీంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతుండడంతో పాఠశాలలోకి వెళ్లాలంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. గత బుధవారం కురిసిన వర్షానికి డ్రైనేజీ కాలువల్లోని మురుగునీటితో పాటు వర్షపు నీరు పాఠశాల ఆవరణలోకి చేరింది. పాఠశాల తగ్గున ఉండడంతో గేటు ముందు ఉన్న డ్రైనేజీ కాలవలోని నీరు వర్షం వచ్చినప్పుడు పైకి వచ్చి ఆవరణలోకి చేరి నిల్వ ఉంటున్నాయి. వర్షం వచ్చిన ప్రతిసారీ ఈ సమస్య తలెత్తుతోందని హెచ్ఎం బొమ్మయ్య, పాఠశాల కమిటీ సభ్యులు వాపోతున్నారు. గ్రామంలోని మురుగునీరంతా పాఠశాల గేటువద్దకు వచ్చి చేరుతోందని, వాటిని పక్కకు మళ్లించాలని అనేక సార్లు ప్రజాప్రతినిధులకు తెలిపినప్పటికీ ప్రయోజనం లేదని అంటున్నారు. నిల్వ ఉన్న నీటినుంచి దుర్వాసన వస్తుండడంతో మధ్యాహ్న సమయంలో విద్యార్థులు భోజనం తినలేకపోతు న్నారని, తక్షణం అధికారులు స్పందించి మురుగునీరు పాఠశాలలోకి చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రేపు బీచ్ కబడ్డీ జట్టు ఎంపిక

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా బీచ్ కబడ్డీ జట్టును ఈనెల 20వ తేదీన ఉదయం 9గంటలకు పట్టణంలోని రైల్వే క్రీడామైదానంలో ఎంపిక చేయనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, సహాయ కార్యదర్శి రాఘవేంద్ర శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కాకినాడలో మే 2నుంచి 4వ తేదీ వరకు 12వ అంతర్ జిల్లాల బీచ్ కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలు జరుగుతాయన్నారు. ఎంపికైన జట్టు ఉమ్మడి జిల్లా జిల్లా తరఫున పోటీలో పాల్గొననున్నట్లు చెప్పారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ఉరవకొండ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం పీసీ కొత్తకోట గ్రామంలో శుక్రవారం ఆంజనేయస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తొలుత ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ఆలయ ఆవరణలో యంత్ర ప్రతిష్ఠ, నవగ్రహ, గణపతి, నాగ ప్రతిమలు, శిఖర కలశప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. టీడీపీ నాయకులు నాగేంద్ర, నాగన్న, శ్రీరాములు, సుధాకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పర్వతారోహకుడికి ఆర్థిక సాయం


ఉపేంద్రకు నగదు అందజేస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

గుత్తి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసురాళ్లపల్లికి చెందిన పర్వతాధిరోహకుడు ఉపేంద్రకు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో శుక్రవారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు, టీడీపీ నాయకుడు ఈశ్వర్ రూ.30 వేల ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపేంద్ర రష్యాలో ఉన్న మౌంట్ ఎల్‌బ్రస్ పర్వతాన్ని అధిరోహించడానికి త్వరలో వెళ్తున్నారని, అతడికి అందరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, నాయకులు రామకృష్ణ, రమేష్, పవన్, న్యాయవాది సోమశేఖర్ పాల్గొన్నారు.

బాధిత రైతును ఆదుకుంటాం


కాలిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న కాలవ భరత్ తదితరులు

రాయదుర్గం టౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): చేతికొచ్చిన పంట ఆకతాయిలు నిప్పు పెట్టడంతో కాలిపోయిందని, జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధిత రైతును ఆదుకుంటామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ పేర్కొన్నారు. మండలంలోని కదరంపల్లి గ్రామంలో రైతు కుమార్‌స్వామి పొలంలో అగ్నికి ఆహుతైన మొక్కజొన్న పంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఐదు ఎకరాల్లో పంట పూర్తిగా కాలిపోయిందని, డ్రిప్ పరికరాలు కూడా కాలిపోవడంతో రూ. ఐదు లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయారు. కాలవ భరత్ మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు, నాయకులు బంగి ఉమాశంకర్, రామస్వామి, భోజరాజు, బొజ్జప్ప, గురుమూర్తి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పశువుల నీటితొట్టె


నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టె

కుందుర్పి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిగానపల్లిలో పశువుల తాగునీటి కోసం ఏర్పాటు చేసిన తొట్టె నిరుపయోగంగా ఉంది. నీటి సౌకర్యం పుష్కలంగా ఉన్నా సుమారు రెండేళ్లుగా ఉపయోగంలో లేకుండా ఉండడంతో శిథిలావస్థకు చేరుతోంది. నీటితొట్టిని ఆనుకుని పెద్ద డ్రైనేజీ కాలవ నిర్మించారు. దీంతో పశువులు అక్కడ నిలబడేందుకు వీలు లేకుండా ఉంది. కనుక ఆ తొట్టె వద్దకు రైతులు పశువులను నీటిని తాపేందుకు తీసుకురావడం లేదు. ఫలితంగా అది నిరుపయోగంగా ఉంది. సంబంధితాధికారులు డ్రైనేజీ కాలువపై బండలు వేసి, నీటి తొట్టెకి మరమ్మతులు చేసి, ఉపయోగంలోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

హిందువులపై దాడులను ఖండించాలి: బీజేపీ

యాడికి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్‌లో హిందువులపై, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని బీజేపీ మండల అధ్యక్షుడు రాజశేఖర్, ఓబీసీ మోర్చా జిల్లా సెక్రటరీ మురళీకృష్ణ తెలిపారు. మండలకేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. బెంగాల్‌రాష్ట్రంలో చాలాకాలం నుంచి హిందువులపై తరచుగా దాడులు జరుగుతున్నాయన్నారు. కాంగ్రెస్‌తోపాటు కొన్ని ప్రాంతీయ పార్టీలు పాలించే రాష్ట్రాల్లో హిందువులపై, హిందూ దేవాలయాలపై దాడులు ఎక్కువయ్యాయని అన్నారు. బెంగాల్‌రాష్ట్రంలో శాంతిభద్రతలు రోజురోజుకు క్షీణిస్తున్నాయని తెలిపారు. అక్కడ రాష్ట్రపతి పాలన పెట్టాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ చోరీ

పెద్దవడుగూరు, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరేపల్లి గ్రామంలోని పలువురు రైతులు తమ పంట పొలాల్లో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్లలో ఉన్న ఆయిల్‌ను శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. జరిగిన సంఘటనపై బాధిత రైతులు మండలకేంద్రంలోని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

అధ్వానంగా గ్రామీణ రహదారి

● ఇబ్బంది పడుతున్న వాహనదారులు

శెట్టూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం నుంచి చింతర్లపల్లి మీదుగా కరిడిపల్లికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలు పడి, రాళ్లు తేలి అధ్వానంగా ఉంది. ప్రయాణించాలంటే ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గుంతల వల్ల ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాల వల్ల కోతలకు గురై రహదారి అధ్వానంగా మారిందని, సమస్యను పలు మార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులకు దృష్టికి తీసుకువెళ్లామని, ప్రయోజనం లేకపోయిందని ఆ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి రహదారిని మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.


అధ్వానంగా ఉన్న రోడ్డు

వైభవంగా జనార్దన వెంకటేశ్వర స్వామి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉరవకొండ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండల కేంద్రంలో శుక్రవారం జనార్దన వెంకటేశ్వర స్వామి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే ఆలయంలో స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అలాగే పల్లకీసేవ, రథ హోమం, రథప్రతిష్ఠాపన, పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. తర్వాత ఉత్సవమూర్తులను రథంలో కొలువుదీర్చి మడుగు తేరు నిర్వహించారు. అనంతరం సాయంత్రం అశేష భక్తజనం నడుమ రథాన్ని లాగారు. భక్తులు రథంపైకి అరటిపండ్లు, జామపండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈఓ కృష్ణయ్య, టీడీపీ నాయకులు కొండయ్య, జయన్న, వలి తదితరులు పాల్గొన్నారు.


మంత్రి భరత్‌తో భేటీ అయిన ఎమ్మెల్యే జయరాం


భూ సమస్యపై మంత్రికి విన్నవిస్తున్న పుట్లూరు మండల నాయకులు

నీటి కోసం నిధులివ్వండి

● మంత్రి టీజీకి ఎమ్మెల్యే గుమ్మనూరు వినతి

గుంతకల్లు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గుత్తి చెరువుకు నీరివ్వడానికి అవసరమయ్యే రూ. 2 కోట్ల నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం జిల్లా ఇన్చార్జి మంత్రి టీజీ భరత్‌కు విన్నవించారు. జిల్లాకేంద్రానికి శుక్రవారం వచ్చిన మంత్రి టీజీ భరత్‌తో ఎమ్మెల్యే జయరాం అక్కడి ఆర్అండ్‌బీ భవనంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గుత్తి పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, చెరువుకు నీటిని అందించడం ద్వారా సమస్య కాస్త తగ్గుతుందని తెలిపారు. కనుక వెంటనే నిధులు మంజూరు చేయాలని, అలాగే నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు కూడా నిధులివ్వాలని కోరారు.

పెద్దారెడ్డి భూములపై చర్యలు తీసుకోండి

పుట్లూరు: వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పుట్లూరు మండలంలోని కోమటికుంట్ల లో ప్రభుత్వ భూములను ఆక్రమించారని వాటి పై చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్‌కు టీడీపీ మండల నాయకులు వినతిపత్రం అందజేశారు. వారు జిల్లాకేంద్రంలో ఎమ్మెల్యేలు జేసీ అస్మిత్‌రెడ్డి, బండారు శ్రావణిశ్రీల సమక్షంలో మంత్రిని కలిసిమాట్లాడారు. కోమటికుంటల్లో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ప్రభుత్వ భూములను బలవంతంగా రాయించుకోవడం, భూములకు వెళ్లే రస్తాకి గేటు వేయడంపై ఇప్పటికే ఆర్డీఓ, తహసీల్దార్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశామని, ఎవరూ పట్టించుకోలేదని అన్నారు. సీఎం కార్యాలయం నుంచి భూమి సర్వే చేసి విచారణ జరపాలని ఆదేశాలు వచ్చినా అధికారులు స్పందించలేదన్నారు. మీరైనా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ.. మాజీ ఎమ్మెల్యే చేసిన అక్రమాలపై చర్యలు తీసుకోని అధికారుల పట్ల సీఎంకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. మండల నాయకులు చవ్వా కులశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రవికుమార్‌రెడ్డి తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

గండికోట ప్రాజెక్ట్ నుంచి పైప్‌లైన్ పూర్తి చేయండి

పుట్లూరు మండలానికి కడప జిల్లా గండికోట ప్రాజెక్ట్ నుంచి పైప్‌లైన్ పూర్తి చేసి తాగు నీటి సమస్యను తీర్చాలని అదే మండలానికి చెందిన మరి కొందరు టీడీపీ నాయకులు మంత్రి టీజీ భరత్‌ను కలిసి విన్నవించారు. గండికోట నుంచి పైప్‌లైన్ పూర్తిచేస్తే సాగు, తాగునీటికి ఇబ్బందులు ఉండవన్నారు. విన్నవించిన వారిలో టీడీపీ మండల కన్వీనర్ బాలరంగయ్య, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్ నాయుడు, నాయకులు శివశంకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గుత్తిరూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రజాపురం గ్రామశివారులో గల పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 17 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు దాడులు చేశామని సీఐ వేంకటేశ్వర్లు తెలిపారు.

బెళుగుప్ప: మండలంలోని కాలువపల్లిలో పేకాటకేంద్రంపై ఎస్ఐ శివ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. అందులో పేకాటాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి, వారి నుంచి 3300 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు దాడులు చేశామని, అరెస్టు అయిన వారిపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

నేడు స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర

శెట్టూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఘురామారావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాలకు ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, సచివాలయ సిబ్బంది తప్పక పాల్గొనాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

బొమ్మనహాళ్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహోన్నూరు గ్రామంలో సుంకులమ్మ అమ్మవారి ఆలయం నిర్మాణం కోసం స్థానిక టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ కేశప్ప రూ. 11 వేలు విరాళం ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులకు శుక్రవారం ఆయన నగదును అందజేశారు.

నవోదయం 2.0పై అవగాహన

తాడిపత్రి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాంపల్లి, గడరగుట్టపల్లి తదితర గ్రామాల్లో ప్రజలకు ఎక్సైజ్ సీఐ నాయుడు నవోదయం 2.0 పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటుసారా వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు తెలియజేశారు. కనుక ఎవరూ నాటుసారా జోలికి వెళ్లరాదని సూచించారు. ఎవరైనా ఎక్కడైనా తయారు చేసినా, విక్రయించినా తమకు సమాచారం అందించాలని కోరారు. ఎక్సైజ్‌సిబ్బంది పాల్గొన్నారు.

మండల వైద్యాధికారిగా విష్ణుమూర్తి

పుట్లూరు, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వవైద్యశాలలో వైద్యాధికారిగా-2గా విష్ణుమూర్తి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అనంతపురం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటికే వైద్యాధికారి శ్రీవాణి ఉండగా, ఇంకో పోస్టు ఖాళీగా ఉన్న విషయం తెలిసిందే. బాధ్యతలు చేపట్టిన విష్ణుమూర్తి మాట్లాడుతూ ఆసుపత్రిలో అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని తెలిపారు.


పండ్లతోటల పెంపకంపై రాయితీ

తాడిపత్రి, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పండ్లతోటల విస్తీర్ణ పథకం ద్వారా రైతులకు చీనీ, దానిమ్మ, బొప్పాయి అల్లనేరేడుతోపాటు పూలతోటల పెంపకానికి 40శాతం రాయితీని ప్రభుత్వం ఇస్తుందని ఆ శాఖ అధికారి ఉమాదేవి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లను కూడా సబ్సిడీపై ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇక దానిమ్మతోటలను పక్షుల బెడద నుంచి రక్షించుకోవడం కోసం యాంటీబర్డ్ నెట్‌ను కూడా 40శాతం రాయితీతో ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు రైతు సేవా కేంద్రాల్లో అర్హత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఈదురుగాలులకు కూలిన విద్యుత్ స్తంభాలు

● విద్యుత్ సరఫరా లేక చీకట్లో గ్రామాల ప్రజలు





వివిధ గ్రామాల్లో పడిపోయిన విద్యుత్ స్తంభాలు

గుమ్మఘట్ట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం సాయంత్రం భారీగా వీచిన ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ముఖ్యంగా కలుగోడు, జే.వెంకటంపల్లి, గోనబావి తదితర గ్రామాల్లో విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. గాలి వీచిందంటే చాటు కరెంటు పోయి గ్రామాల్లో ప్రజలు కటిక చీటల్లో బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోంది. ఎపుడు ఈదురుగాలులు వీచిన వెంటనే విద్యుత్ సరఫరా ఆగిపోతుందని పలువురు వాపోయారు.

గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

● చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు శుక్రవారం ప్రార్థనలు చేశారు. గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని అన్ని పట్టణాలు, మండలకేంద్రాలతోపాటు గ్రామాల్లో సైతం పెద్దఎత్తున క్రైస్తవులు ఆయా చర్చిలకు ఉదయమే వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు మాట్లాడుతూ.. శాంతిసందేశం ఏసుక్రీస్తు సూచించిన మార్గమని, మానవాళి ఆచరించాలని తెలిపారు. మానవాళి కోసం ఏసు చేసిన మహాత్యాగమే గుడ్‌ఫ్రైడేనని వివరించారు. పలుచోట్ల క్రైస్తవులు శిలువను మోస్తూ ర్యాలీలు నిర్వహించారు.


తాడిపత్రిలో శిలువను మోస్తూ ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు


యాడికి సీఎస్ఐ చర్చిలో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు


ఉరవకొండ సీఎస్ఐ చర్చిలో..


గుత్తి చర్చిలో శాంతి సందేశం వినిపిస్తున్న పాస్టర్

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

తాడిపత్రి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని పట్టణంలోని పడమటిగేరి, టైలర్స్‌కాలనీలో శుక్రవారం ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ తాడిపత్రి డివిజన్ కన్వీనర్ ఉమాగౌడ్ మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్ ఆమోదించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మైనార్టీలకు అండగా సీఐటీయూ ఉంటుందన్నారు. దేశ సమైక్యత కోసం మతాలకు అతీతంగా అందరూ కలిసి ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. సుప్రీం కోర్టు స్పష్టంగా చెబుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం దిగిరాకపోవడం దారుణమని తెలిపారు. ఆరురోజులపాటు నిరసనలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యూనియన్ నాయకులు అరిఫా, హసీనా, షాను షఫి, బసిరున్, రుక్సానా, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

రైలులో ప్రయాణికుడి మృతి


భీమన్న మృతదేహం

గుత్తి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రైల్లో ప్రయాణిస్తూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున గుత్తి రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం యాదగిరికి చెందిన భీమన్న(45) కుటుంబ సమేతంగా బెంగళూరుకు నాదెండ్ ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్-7 బోగిలో ప్రయాణిస్తున్నాడు. గుంతకల్లు దాటిన తరువాత ఆయన ఉన్నట్టుండి స్పృహ తప్పిపడిపోయాడు. ప్రయాణికులు వెంటనే రైల్వే అధికారులకు సమాచారం అందజేశారు. రైలు గుత్తి రైల్వేస్టేషన్‌కు రాగానే పోలీసులు ఆ వ్యక్తిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గుండెనొప్పితో మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. భీమన్న బెంగళూరులో బిల్డర్‌గా పనిచేస్తున్నట్లు తెలిసింది. మృతుడికి భార్య ఎల్లమ్మ, కుమారుడు రమేష్, కుమార్తె దీపక ఉన్నారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాలుజారి పడి యువకుడు..


విక్టర్‌కుమార్ మృతదేహం

తాడిపత్రి: పట్టణంలోని నందలపాడు చర్చిలో శుక్రవారం ప్రార్థనకు వెళ్లిన ఓ యువకుడు పైఅంతస్థుకు వెళ్లేందుకు మెట్లు ఎక్కుతూ ప్రమాదవశాత్తూ కాలు జారి పడి మృతి చెందాడు. స్థానికంగా నివాసం ఉన్న మనోహర్, జయమ్మ దంపతుల కుమారుడు విక్టర్‌కుమార్ (28) గత కొంతకాలం కిందట మతిస్థిమితం కోల్పోయాడు. పలుచోట్ల చూపించినా నయం కాలేదు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా చర్చిలో ప్రార్థనకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. అయితే అక్కడ పైఅంతస్తుకు మెట్ల నుంచి వెళుతూ ప్రమాదవశాత్తూ కాలుజారి కిందపడ్డాడు. ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గ్యాస్ కట్టర్ పేలి వ్యక్తికి గాయాలు

తాడిపత్రి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని భోగసముద్రం పంచాయతీలోని బుగ్గ వద్ద సుగుణ స్పాంజ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఆయిల్‌డ్రమ్‌ను గ్యాస్ కట్టర్‌తో కట్ చేస్తుండగా పేలుడు జరిగి కుశలన్న అనే వ్యక్తి గాయాలపాలయ్యాడని స్థానికులు, పోలీసులు తెలిపారు. నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన కుశలన్న కొన్నిరోజులక్రితం అయ్యవారిపల్లి గ్రామానికి వచ్చి ఇక్కడే నివాసం ఉంటూ సుగుణ స్పాంజి పవర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఆయిల్ డ్రమ్‌ను గ్యాస్ కట్టర్‌తో కట్ చేస్తుండగా ఒక్కసారిగా పేలింది. ప్రమాదంలో వాటికి ఉన్న ఇనుప రేకులు అతడి కాళ్లకు, చేతులకు, తలకు తగలడంతో గాయాలయ్యాయి. వెంటనే యాజమాన్యం తాడిపత్రి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ సంఘటన జరగడం వల్ల పరిశ్రమలో ఏదైనా ఘటనలు జరుగుతాయని యాజమాన్యం ముందుజాగ్రత్తతో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసింది. పరిశ్రమలోని కూలీలు మాత్రం యాజమాన్యం తమ పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని, సేఫ్టీకి సంబంధించి బూట్లు, ఇతర సామగ్రి అందజేయడంలో నిర్లక్ష్యం వహించిందని ధ్వజమెత్తారు. ఎవరైనా ఏమైనా అడిగితే పనిలో నుంచి పీకేస్తామని బెదిరిస్తారని వాపోయారు. ఇప్పటికైనా యాజమాన్యం కూలీల పట్ల శ్రద్ధ వహించాలని వారు కోరారు.

పేదల కోసం పోరాడేందుకే ...సీపీఐ

రాయదుర్గంటౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పేదల కోసం సీపీఐ పని చేస్తోందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. సీపీఐ నియోజకవర్గ మహాసభల సందర్భంగా పట్టణంలో శుక్రవారం వారు పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి వినాయకసర్కిల్ నుం చి శాంతినగర్ వరకు ర్యాలీ చేపట్టారు. తర్వాత షాదీమహల్‌లో సమావేశం నిర్వహించారు. ఇందులో జిల్లా కార్యవర్గ సభ్యులు సంజీవప్ప, నాగార్జున మాట్లాడుతూ నిరంతరం ఉద్యమాలతో ప్రభుత్వాలపై పోరాటాలు చేస్తూ ప్రజా శ్రేయస్సు కోసం సీపీఐ ఉద్యమిస్తోందన్నారు. పేదల హక్కుల కోసం ఉద్యమిస్తూ 100 ఏళ్ల పూర్తి చేసుకున్న ఘనత కేవలం సీపీఐకే చెందుతుందన్నారు. తర్వాత నూతన కమిటీలను ఎన్నిక చేశారు. రాయదుర్గం పట్టణ కార్యదర్శిగా రవీంద్ర, సహాయ కార్యదర్శిగా శంకర్, తొమ్మిదిమంది కార్యవర్గ సభ్యులను ఎన్నిక చేశారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతు, జిల్లా కోశాధికారి ఆంజనేయులు, ఏపీ రైతు సంఘం ఉపజిల్లా అధ్యక్షుడు శర్మాస్, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, తిప్పేస్వామితో పా టు అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రీల్స్ చేస్తూ కింద పడ్డానని చెప్పడం అబద్ధం

హైదరాబాద్ పోలీసుల ప్రకటనను ఖండించిన బాధితురాలు

ఉరవకొండ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడి నుంచి తనను తాను కాపాడుకునేందుకు రైలు నుంచి దూకితే, రీల్స్ చేస్తూ కింద పడ్డానని పోలీసులు పచ్చి అబద్ధాలు చెబుతున్నారని ఉరవకొండకు చెందిన యువతి ఆవేదన వ్యక్తం చేసింది. తనకు న్యాయం జరిగేంతవరకూ పోరాడతానని అన్నారు. ఉరవకొండలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. హైదరాబాదులోని ఓ ప్రైవేట్ కంపెనీలో తాను ఉద్యోగం చేస్తున్నానని ఆమె తెలిపారు. మార్చి 22న తన సెల్‌ఫోన్ రిపేరీ చేయించుకునేందుకు సికింద్రాబాదుకు వచ్చి, తిరిగి రైల్వేస్టేషన్‌లో ఎంఎంటీఎస్ రైలు ఎక్కి మేడ్చల్‌కు బయలుదేరానని తెలిపారు. తాను ఎక్కిన బోగీలో ఎవరూ లేకపోవడంతో అందులో ఉన్న యువకుడు తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని తెలిపారు. దీంతో తాను భయపడి కదిలే రైలు నుంచి కిందకు దూకేశానని తెలిపారు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదని, హైదరాబాదు యశోద ఆసుపత్రిలో రెండ్రోజుల పాటు చికిత్స పొందానని తెలిపారు. పోలీసులు మార్చి 25న ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారని, యువకుడు దాడి చేసినందుకు తాను దూకలేదని, రీల్స్ చేస్తూ జారిపడ్డానని పోలీసులు చెప్పారని అన్నారు. పోలీసులు అబద్ధాలు చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు.

చిరుతకు ఏమైంది?

● అనారోగ్యం బారిన పడిందా?
● నడవలేని స్థితిలో కనిపించిన వైనం


రెండ్రోజుల క్రితం గ్రానైట్ కొండలో సంచరిస్తున్న చిరుత

కంబదూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మెరుపు వేగంతో పరుగెత్తే చిరుత.. నడవలేని స్థితిలో కనిపించింది. కాలికి గాయాలున్నట్లు చిరుత చూసిన రైతులు చెబుతున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఓబయ్య తోట సమీపాన గల గ్రానైట్ కొండలో రెండ్రోజుల క్రితం చిరుత కనిపించిన సంగతి తెలిసిందే. ఆ చిరుత శుక్రవారం ఉదయం సమీప పొలాల్లో రైతులకు కంటపడింది. అనారోగ్యం బారిన పడినట్లు దూరం నుంచి చూసిన రైతులు గుర్తించారు. నడవలేకపోతోందని వారు తెలిపారు. కాళ్లకు గాయాలవడంతో నెమ్మదిగా నడుస్తున్నట్లు చెప్పారు. రైతులు కేకలు వేయడంతో నడవలేని స్థితిలో నెమ్మదిగా సమీప కొండల్లోకి వెళ్లిపోయింది. విషయాన్ని రైతులు.. అటవీ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చిరుతను కాపాడాలని కోరుతున్నారు.